క్లుప్తంగా

నేడు కౌన్సిల్ సమావేశం

నెహ్రూ నగర్: నగరపాలక సంస్థ వార్షిక బడ్జెట్ ఆమోదానికి సోమవారం ఉదయం 10.30 గంటలకు జీఎంసీ కౌన్సిల్ హాల్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. సమావేశానికి ఇన్‌చార్జి మేయర్ షేక్ సజీల అధ్యక్షత వహించనున్నారు. సమావేశంలో కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు పాల్గొంటారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



గుంటూరు మెడికల్: బీజేపీ ఆవిర్భావ దినోత్సవం లాలుపురం రోడ్డులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతి రావు జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ సంక్షేమ పథకాలను అమలులోకి తీసుకొచ్చి ప్రజలకి చేరువ చేస్తున్నారన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ జాతీయ కౌన్సిల్ మెంబర్ జూపూడి రంగరాజు, రాష్ట్ర హెడ్ క్వార్టర్ ఇన్‌చార్జి మకుటం శివ, నాయకులు కె.వెంకట సుబ్బారావు, పి.రవికుమార్, ఎస్.కుమార్ గౌడ్, తోట రామకృష్ణ, వైవీ సుబ్బారావు, పాండురంగ విఠల్, ఆవుల నాగేంద్ర యాదవ్, డాక్టర్ ఉమాశంకర్, కంతేటి బ్రహ్మయ్య, వి. గంగాధర్ పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

నెహ్రూనగర్: డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో(0863- 2224202) నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు ఉంటుందని చెప్పారు. అనంతరం గుంటూరు నగరపాలక సంస్థ 2025-26 వార్షిక బడ్జెట్‌పై కౌన్సిల్ సమావేశం కౌన్సిల్ హాల్‌లో జరుగుతున్న సందర్భంగా ప్రతి సోమవారం గుంటూరు నగరపాలక సంస్థలో నిర్వహించే 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని జనన, మరణ నమోదు కార్యాలయం వద్ద(పార్కింగ్ వద్ద) నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

సామాజిక చైతన్య యాత్రలో ఐద్వా



లక్ష్మీపురం: మహిళల సమస్యలపై నిరంతరం పనిచేస్తున్న ఐద్వా సామాజిక చైతన్య యాత్ర పేరుతో సామాన్య మహిళల దగ్గరకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకోవటం జరుగుతుందని సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డి.శ్రీనివాస్ కుమారి అన్నారు. బ్రాడీపేటలోని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు కే పద్మ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అధిక ధరలు అరికట్టాలని, ఉచిత గ్యాస్, అమ్మ ఒడి లాంటి పథకాలకు అధికారంలో ఉన్న ప్రభుత్వం వాగ్దానాలు చేసి వాటిని అమలు చేయడంలో జాప్యం చేస్తుందని విమర్శించారు. అదే విధంగా ఉచిత గ్యాస్ పథకానికి ప్రభుత్వమే అకౌంట్‌లో డబ్బులు వేయాలని పేద కుటుంబాల వారు ఉచిత గ్యాస్ కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని, ఎంతోమంది సామాజిక పెన్షన్, ఒంటరి మహిళలు పెన్షన్ కోసం ఎదురు చూస్తున్నా కొత్త పెన్షన్ మంజూరు చేయడం లేదని విమర్శించారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై చైతన్యం తీసుకురానున్నట్లు చెప్పారు. సమావేశంలో ఐద్వా జిల్లా నాయకులు ఎల్.అరుణ, నగర అధ్యక్ష, కార్యదర్శులు జి.రమణ, ఎ.కళ్యాణి, కే పద్మ, ఎస్‌కే ఖాజాబీ పాల్గొన్నారు.

నేటి నుంచి జాబ్‌మేళాకు పేర్లు నమోదు

నెహ్రూనగర్: స్మార్ట్ టెక్స్, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో త్వరలో నిర్వహించనున్న గుంటూరు మెగా జాబ్ మేళాకు సోమవారం నుంచి నగరంలోని వార్డ్ సచివాలయాల్లో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్మార్ట్ టెక్స్, జీఎంసీ ఆధ్వర్యంలో నగరంలో 10వ తరగతి పైన చదివిన నిరుద్యోగ యువతకు వారి అర్హతకు తగిన విధంగా ఉండేలా సుమారు 50 కంపెనీల నుంచి ఉద్యోగాలు అందించేలా గుంటూరు మెగా జాబ్ మేళా నిర్వహించనున్నామన్నారు. ఐటీ, నాన్ ఐటీ బ్యాంకింగ్, ఫార్మసీ, నర్సింగ్ రంగాల్లోని వివిధ కంపెనీలు నిర్వహించే ఉద్యోగాల కల్పనకు, ఈ నెల 9న విజ్ఞాన మందిరంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వర్క్ షాప్(సర్టిఫికేట్ వెరిఫికేషన్) జరుగుతుందన్నారు. నగరంలో ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువత తమకు అందుబాటులోని వార్డ్ సచివాలయంలో క్యూఆర్ కోడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

కల్యాణం... కమనీయం

చేబ్రోలు: చేబ్రోలు మండలంలో వాడవాడలా శ్రీరామనవమి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని కొత్తరెడ్డిపాలెం సీతారామాంజనేయస్వామి దేవస్థానంలో వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. భద్రాచలంలో సీతారాముల కల్యాణం మాదిరిగా సీతారామస్వామి దేవస్థానంలో పూజ కార్యక్రమాలు నిర్వహించారు. వేజండ్ల కోదండ రామస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎదురుకోల ఉత్సవం చేపట్టారు. శలపాడులోని సీతారామస్వామి దేవస్థానం, చేబ్రోలు జీబీసీ రహదారి సమీపంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో, మంచాలలోని కోదండరామస్వామి దేవస్థానం, శ్రీరంగపురం, నారాకోడూరు, వడ్లమూడి, శేకూరు, తదితర గ్రామాల్లోని రామాలయాల్లో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా చోట్ల కల్యాణమూర్తుల గ్రామోత్సవాలు ఘనంగా నిర్వహించారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

పొన్నూరు: నియోజకవర్గంలో శ్రీరామనవమి వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని తెలగపాలెం కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ అర్చకులు చిలకపాటి లక్ష్మణ్ రామాచార్యులు కల్యాణం జరిపించారు. భక్తులకు పానకం, వడపప్పు, పులిహోర వితరణ చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ శాశ్వత ధర్మకర్త ఆకుల వెంకటేశ్వరరావు, అధ్యక్షులు అల్లం సాంబశివరావు, కార్యదర్శి శింగంశెట్టి శివశంకర్, ఉపాధ్యక్షులు అప్పికట్ల వెంకటేశ్వరరావు కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. సాయంత్రం శ్రీ స్వామివారి ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు.

- మండలంలోని పచ్చల తాడిపర్రులోని రామాలయం, మన్నవ గ్రామంలోని చెన్నకేశవ స్వామి దేవాలయం, చింతలపూడిలోని కోదండ రామాలయం, పట్టణంలోని 26వ వార్డు రజకపేట లక్ష్మీ గణపతి దేవస్థానం, పట్టణంలో ఆర్యవైశ్యులు ఏర్పాటు చేసిన మండపంలో సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పాల్గొని స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పెదకాకాని: శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని కొప్పురావూరు, వెనిగండ్ల, అగతవరప్పాడు, పెదకాకాని, నంబూరు, గోళ్లమూడి, తక్కెళ్లపాడు, ఉప్పలపాడు, వెంకటకృష్ణాపురం, అనుమర్లపూడి గ్రామాలలో ఉన్న రామాలయాల వద్ద సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఈ కళ్యాణ క్రతువులో పలువురు దంపతులు పీటలపై కూర్చుని పూజలు జరిపించారు. అనంతరం భక్తులందరికీ పానకం, వడపప్పు, పులిహోర, పొంగలి పంపిణీ చేశారు.

కాకుమాను మండలంలో...

కాకుమాను: మండల కేంద్రం కాకుమానులో వేంచేసి ఉన్న కోదండ రామాలయం ఆదివారం శ్రీ రామనవమి సందర్భంగా స్వామి కల్యాణ మహోత్సవం కమనీయంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామి దంపతులను విశేషంగా పట్టు వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక వాహనంపై ఏర్పాటు చేసి గ్రామ పురవీధులలో గ్రామోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం ప్రత్యేకంగా అలంకరించిన కళ్యాణ మండపంలో స్వామి దంపతులను పట్టు వస్త్రాలతో అలంకరించి కనుల పండువలా కళ్యాణ మహోత్సవం అంగరంగవైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నాగ ప్రదీప్ కుమార్, డీవీ రామాచార్యులు, స్వామి దంపతులకు కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఏర్పాట్లను గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త కారుమంచి ప్రసాద్ బాబు పర్యవేక్షించారు.



పట్టణంలోని తెలగపాలెం శ్రీ కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణం



మన్నవ శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయంలో అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే



స్వామి దంపతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



తెలగపాలెం శ్రీ రామ మందిరంలో అలంకరణలో స్వామివారు



వెనిగండ్లలో పూజలందుకుంటున్న సీతారామలక్ష్మణులు



మంచాలలోని రామాలయం వద్ద సీతారాముల కల్యాణోత్సవం

జూదం మత్తు.. జీవితాలు చిత్తు

- బానిసవుతున్న యువత
- లోన్ యాప్‌లతో అప్పుల పాలు
- బెట్టింగ్‌లతో బలవన్మరణాలకు పాల్పడుతున్న వైనం



పట్నంబజారు: ఆన్‌లైన్ వేదికగా జూదం వికటాట్టహాసం చేస్తోంది. వ్యసనపరులు ఉన్నంత కాలం.. తనని ఎవరూ ఏమి చేయలేరని విర్రవీగుతోంది. జూదం వ్యసనంగా మారి.. ఆఖరికి అప్పులపాలై.. ఆన్‌లైన్‌లో లోన్‌యాప్‌ల్లో అప్పులు తీసుకుంటూ.. భయపడే పరిస్థితికి యువత చేరుకుంటున్నారు. కష్టపడకుండా ధనవంతులు కావాలన్న దురాశే.. వారిని జూదానికి ఆకర్షితులను చేస్తోంది.

సరదాగా ప్రారంభమై..

సరదాగా స్నేహితులతో కలిసి మొదలుపెట్టిన జూదం వ్యసనంగా మారిపోతోంది. పాత గుంటూరు నందివెలుగు రోడ్డుకు చెందిన గోపి(పేరు మార్చటం జరిగింది) నిత్యం ఆన్‌లైన్‌లో రమ్మీ, సింగిల్ నంబర్, బాల్ గేమ్ వంటివి ఆడుతూ ఉంటాడు. మధ్యతరగతి కుటుంబానికి చెందిన అతను రూ.3 లక్షలకుపైగా అప్పులు కావటంతో వాటిని తీర్చలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గతంలో బ్రాడీపేటలో ఒక ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ పిస్టల్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కలకలం రేపింది. ఆయన కూడా నిత్యం బెట్టింగ్‌లు ఆడుతుండటంతోనే ఇటువంటి పరిస్థితి ఏర్పడిందని తోటి సిబ్బంది చెప్పుకున్న పరిస్థితులు. కోబాల్డుపేటకు చెందిన ఒక యువకుడు ఆన్‌లైన్ గేమ్‌ల్లో డబ్బులు పోగొట్టుకుని, యాప్‌ల్లో అప్పులు చేసి వారి వేధింపులు తట్టుకోలేక, మార్ఫింగ్ ఫొటోలు పెడుతూ ఇబ్బందులు పెడుతున్న నేపథ్యంలో పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన కలకలం రేపింది.

ఫేక్ జీపీఎస్ యాప్‌లు...

ఆన్‌లైన్‌లో జూదం, పేకాట, రమ్మీ, తీన్‌పట్టి, అందర్, బాహర్ వంటి ఆటలను అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పూర్తిగా నిషేధించింది. అయితే జూదపరులు మాత్రం వాటిని ఆడేందుకు మాత్రం కొత్తదారులు వెతుక్కుంటున్నారు. సెల్‌ఫోన్‌లోని ప్లేస్టోర్ ద్వారా ఫేక్ జీపీఎస్ లోకేషన్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుని, డెవలపర్ సిస్టమ్ ద్వారా ఆటలు ఆడుతున్నారు. ఆఖరికి సరదాగా ఆడుకునే క్యారమ్స్, లూడో వంటివి కూడా డబ్బులు పెట్టే గేమింగ్ యాప్‌లు వచ్చాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. రూ.10తో సరదాగా మొదలుపెట్టిన వారే ఆఖరికి లక్షలాది రూపాయలు జూదానికి పెట్టి బలైపోతున్నారు.

రుణాల ఊబిలో చిక్కుకుని..

బాధితుల్లో అత్యధికులు స్మార్ట్ ఫోన్‌లపై గంటల కొద్దీ సమయం గడుపుతున్న వారే ఉండటం గమనార్హం. తొలుత కొంత నష్టపోతున్న ఆటగాళ్లు మళ్లీ తిరిగి పొందలేకపోతామా? అన్న ధీమాతో అప్పులు చేసి మరీ ఆటలో గుమ్మరిస్తున్నారు. సులువుగా అప్పు దొరుకుతుండటంతో ఆన్‌లైన్ రుణాల యాప్‌లను ఆశ్రయిస్తుండటం మరో ఊబిలోకి దిగుతున్నట్లు అవుతోంది. ఇలా తప్పుల మీద తప్పులు చేస్తూ చివరికి తమను తానే కాపాడుకోలేనంత ఉచ్చులోకి వెళ్లిపోతున్నారు. అప్పులు ఇచ్చిన వ్యక్తులు వేధిస్తున్న క్రమంలో డిప్రెషన్‌కు లోనవుతున్నారు. అప్పుల బాధ భరించలేక ఆస్తులు అమ్ముకున్న వారు కొందరుంటే ఆత్మహత్యలకు పాల్పడి జీవితాలను, కుటుంబాలను ఛిద్రం చేసుకుంటున్న వారు లేకపోలేదు. ఇప్పటికైనా జూదానికి స్వస్తి చెప్పి.. సక్రమైన బాటలో పయనించాలని పోలీసు అధికారులతో పాటు, పలువురు నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్ మాయ

ఆన్‌లైన్‌లో బెట్టింగులులకు సంబంధించి ప్రతి ఒక్కరూ యూట్యూబ్, ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్ చూసేటప్పుడు ప్రకటనలు వస్తున్నాయి. దీనితో పాటుగా వారికి కొంచెం డబ్బు ముందు ఇస్తామని చెప్పి, అవి పోయిన తరువాత బ్యాంకు ఖాతాల నుంచి ఆన్‌లైన్ జూదం యాప్‌లకు లక్షలాది రూపాయలు కొడుతున్నారు. ఇటువంటి వారు ఎంతో మంది ఉన్నారు. ఆఖరికి నగరాలు, పట్టణాల నుంచి బెట్టింగ్ మహమ్మారి పల్లెలకు కూడా తాకింది. సులువుగా డబ్బు సంపాదించాలనుకుంటున్న కొందరు యువకులు భవిష్యత్ చేజేతులా నాశనం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో జూదం ఏదైనా ఆ ఊబిలోంచి బయటపడటమే ఉత్తమమని పోలీసులు, మానసిక నిపుణులు సూచిస్తున్నారు.

బేరం కుదిరింది...

- గతంలో ఎగ్జిబిషన్ అనుమతికి నో చెప్పిన అధికారులు
- ఈ నెల 16 నుంచి ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ఫ్లెక్సీలు ఏర్పాటు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలోని స్థంభాల గరువు దగ్గర ఉన్న చేబ్రోలు హనుమయ్య కంపెనీ ప్రాంగణంలో ఎగ్జిబిషన్ ఏర్పాటుకు నగరపాలక సంస్థ అనుమతి ఇచ్చింది. గతంలో ఇదే ప్రాంతంలో కూటమి నేతల అండదండలతో ఎటువంటి అనుమతులు లేకుండా ఎగ్జిబిషన్ పనులు నిర్వాహకులు ప్రారంభించారు. దీనిపై స్థానిక వాసులు నగర కమిషనర్‌కు గత నెల 16వ తేదీన పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేశారు. కమిషనర్ సదరు ప్రాంతాన్ని పరిశీలించి ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయకుండా దానిని అడ్డుకున్నారు. రెండు సార్లు పొక్లెయిన్ సాయంతో వాటిని కూల్చేశారు. తీరా సదరు ప్రాంతంలో ఈ నెల 16 నుంచి ఎగ్జిబిషన్ ప్రారంభం అంటూ సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ చిత్రపటాలతో ఫ్లెక్సీలు దర్శనమిచ్చాయి. దీంతో స్థానికులు అవాక్కయ్యారు. మొన్నటి దాకా ఎగ్జిబిషన్ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వని నగరపాలక సంస్థ అధికారులు ఇప్పుడు ఏ విధంగా అనుమతులు ఇచ్చారంటూ అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. ఎగ్జిబిషన్ అనుమతికి లక్షల్లో చేతులు మారినట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. జనావాసాల మధ్య ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తే కాలుష్యంతో పాటు ట్రాఫిక్ సమస్యలు, అపరిశుభ్ర వాతావరణంతో రోగాల బారిన పడే అవకాశం ఉందని కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లినా ఎగ్జిబిషన్‌కు అనుమతి ఇవ్వడంపై స్థానికులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు.



గత కొద్ది రోజుల క్రితం అనుమతి ఇవ్వకపోవడంతో సామాను పక్కన పెట్టి ఉంచిన దృశ్యం



10 ఈ నెల 16 నుంచి ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్నట్లు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

పాపిరెడ్డి మృతికి సంతాపం

నగరంపాలెం: ప్రముఖ సోషలిస్టు నాయకుడు మోదుగుల పాపిరెడ్డి మృతికి విశ్రాంత పోలీస్ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి కాళహస్తి సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. పాపిరెడ్డి సోషలిస్టు భావాలు కలిగిన వ్యక్తి అని తెలిపారు. ప్రజల కోసం అనేక పోరాటాలు చేసి జైళ్లకు వెళ్లారని గుర్తుచేశారు.

మద్యం చిచ్చుపై ఆగ్రహం

- నిబంధనలు ఉల్లఘింస్తున్న మద్యం దుకాణదారులు
- విచ్చలవిడిగా అమ్మకాలు
- రెచ్చిపోతున్న మందుబాబులు
- వినుగెత్తుతున్న ప్రజలు
- వారం రోజుల్లో రెండుచోట్ల ధర్నాలే నిదర్శనం

తెనాలి: ఆంధ్రా ప్యారిస్ తెనాలిలో ఇళ్ల మధ్య మద్యం దుకాణాలు, విచ్చలవిడి అమ్మకాలు, మందుబాబుల ఆగడాలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఏకంగా రోడ్డుపైకి వచ్చి ఆందోళనకు పూనుకుంటున్నారు. గత వారం రోజుల వ్యవధిలో తెనాలిలో ఇలాంటి ఘటనలు రెండుచోట్ల జరగడం ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. గత ప్రభుత్వం అమలుచేసిన మద్యం విధానానికి భిన్నంగా కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన పాలసీ అమలులో నిర్లక్ష్యం ఫలితంగానే ప్రజలు రోడ్డెక్కాల్సిన పరిస్థితి దాపురించింది. పట్టణ నందులపేట ఘంటావారి వీధిలో మూతబావి సెంటరులో గల మద్యం షాపునకు వస్తున్న మందుబాబుల ఆగడాలపై అక్కడి మహిళలు అదే షాపు ఎదుట టెంటు వేసుకుని మరీ ధర్నాకు దిగిన విషయం తెలిసిందే. ఇళ్ల మధ్య రాత్రివేళల్లో అమ్మకాలు, మద్యం కోసం వచ్చే వారితో అక్కడ ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. అర్ధరాత్రి మందులో కలుపుకునేందుకు నీటి కోసం, సమీపంలోని ఇళ్ల ముంగిట ఉన్న చేతి పంపుల దగ్గరకు వచ్చేస్తున్నారు. పెద్దపెద్దగా మాట్లాడుకోవడం, కేకలు, బూతుల పంచాంగంతో ప్రజలకు నిద్రా భంగం కలుగుతోంది. వీటికితోడు రెండుమూడు రోజుల క్రితం రాత్రి వేళ మద్యం తాగిన కొందరు యువకులు వైన్‌షాపు ముందే బాహాబాహీకి తలపడటంతో అక్కడంతా గందరగోళం నెలకొంది. జనం భయభ్రాంతులయ్యారు. ఇక లాభం లేదనుకుని శుక్రవారం ధర్నాకు దిగారు. దీనికిముందుగా గత నెల 30న ముత్యంశెట్టిపాలెం రోడ్డులోని సెంటరులో మద్యం షాపు ఏర్పాటు చేయడంతో అక్కడి మహిళలు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలియజేశారు. వాస్తవానికి ఆ షాపు, బుర్రిపాలెంరోడ్డులోని పాత రత్నా టాకీస్ పక్కన ఉండేది. అక్కడి కాంప్లెక్సులో విద్యా సంస్థ ఉందన్న కారణంగా అభ్యంతర పెట్టటంతో అదే మద్యం షాపును ముత్యంశెట్టిపాలెంలోని ఓ భవనంలోకి మార్చారు. ఇళ్లమధ్య మద్యం షాపేంటని స్థానికులు ఆందోళనకు దిగటంతో చేసేది లేక, మళ్లీ యథాస్థానానికి మార్చుకున్నారు. అక్కడ కూడా బహిరంగంగా మద్యం తాగడం నిత్యం కనిపించే దృశ్యం.



నందులపేటలో ధర్నా చేస్తున్న మహిళలు (ఫైల్)



మద్యం దుకాణం ఎదుట మందుబాబుల వీరంగం(ఫైల్)

గత పాలనలో పరిస్థితి వేరు

గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ వైన్‌షాపులు నిర్ణీత సమయాలను కచ్చితంగా పాటించేవి. రాత్రి తొమ్మిది గంటల తర్వాత మద్యం విక్రయించేవారు కాదు. మద్యం కొనుగోలు చేసిన వారికి అక్కడ తాగేందుకు అనుమతి ఉండేది కాదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో నూతన పాలసీని తీసుకొచ్చి లాటరీల ద్వారా మద్యం షాపులను కేటాయించారు. షాపులను దక్కించుకున్న లైసెన్సుదారులు యథేచ్ఛగా నిబంధనలను అతిక్రమిస్తున్నారు. రాత్రి పదిగంటలకు మూసేయాల్సిన మద్యం షాపుల్లో 11 గంటలకు కూడా అమ్మకాలు చేస్తున్నారు. ఆ తర్వాత కూడా బ్యాక్ డోర్ అమ్మకాలను తెల్లవార్లు కొనసాగిస్తున్నారు. షాపుల్లో మద్యం తాగేందుకు ఎలాంటి అనుమతి లేదు. అయినా సరే, కొనుగోలు చేసిన వారు అక్కడే తాగేస్తున్నారు. అవసరమైన మంచినీరు, గ్లాసులు, టచింగ్ పదార్థాలతో సహా షాపుల నిర్వాహకులే అందుబాటులో ఉంచుతున్నారు. ఫలితంగానే మందుబాబులు ఎప్పుడంటే అప్పుడు మద్యం షాపులకు వెళ్లటం, అక్కడే తాపీగా తాగేస్తున్నారు. మూకుమ్మడిగా వెళ్లినపుడు మాటామాటా పెరిగి బూతులు తిట్టుకుంటూ బాహాబాహీకి దిగుతున్నారు. నందులపేట వైన్‌షాపు వద్ద కొట్లాట ఆ క్రమంలో జరిగిందే. నందులపేటలో మందుబాబు ఆగడాలపై ధర్నా చేసిన మహిళలతో, ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు, మద్యం షాపుల్లో తాగకుండా ఆపేస్తామని కాకుండా, బహిరంగంగా తాగకుండా చూస్తామని హామీనివ్వడం కొసమెరుపు. మద్యం షాపుల నిబంధనల అతిక్రమణ వెనుకగల కారణాలు అందరికీ తెలిసినవే.

రూల్స్ అతిక్రమిస్తే ఉపేక్షించం

మద్యం షాపులు రూల్స్ అతిక్రమిస్తే క్షమించేది లేదు. నందులపేటలో మహిళలు ధర్నా చేసిన మద్యం షాపు దగ్గర ప్రత్యేకంగా ఓ కానిస్టేబుల్‌ను కాపలా ఉంచాం. మిగిలిన దుకాణాల్లోనూ పరిశీలించి, నిబంధనలను కచ్చితంగా పాటించేలా చూస్తాం.

– ఏవీ చలం, సీఐ, ప్రొహిబిషన్, ఎక్సైజ్, తెనాలి

అలరించిన వీరబ్రహ్మేంద్ర స్వామి పౌరాణిక పద్య నాటకం

నగరంపాలెం: శ్రీరామనవమిని పురస్కరించుకుని డీఎస్ నగర్‌లోని కోదండరామస్వామి దేవాలయంలో ఏపీ రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక శాఖ(విజయవాడ) సౌజన్యంతో శ్రీఆంజనేయ కళా నాట్య మండలి ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి జీవిత చరిత్ర పౌరాణిక పద్య నాటకం ప్రదర్శించారు. ఏకాంబర యోగిగా గుండ్రటి కోటేశ్వరరావు, బ్రహ్మం పాత్రల్లో సుద్దపల్లి రంగారావు, టి.ఏసుబాబు, సిద్దయ్యగా నూతంగి వెంకటస్వామి, నరసింహారెడ్డి, బోనాల సుబ్బారావు, పోటులురయ్యా గుండ్రటి కోటేశ్వరరావు, గోవిందయ్య చిల్ల సీతారామయ్య తదితర పాత్రదారులు పౌరాణిక పద్యాలతో ఆహుతులను అలరించారు. హార్మోనియంపై వి.వెంకటేశ్వరావు, డోలక్‌పై శ్రీనివాసరావు, క్లారినెట్‌పై రంగారావు వాయిద్యాన్ని అందించగా, మిరియం కోటేశ్వరరావు పర్యవేక్షించారు.



నాటకంలో ఓ సన్నివేశం

సోము వీర్రాజును కలిసిన బీజేపీ జిల్లా నాయకులు



గుంటూరు మెడికల్: బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, శాసన మండలి సభ్యుడు సోము వీర్రాజు ఆదివారం వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో గుంటూరు రైల్వేస్టేషన్‌కి వచ్చిన సందర్భంగా పార్టీ గుంటూరు జిల్లా నాయకులు పెద్ద ఎత్తున ఘనస్వాగతం పలికారు. వీర్రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. దేశం అన్ని అంశాల్లో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో విస్తరణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు, వల్లూరు జయప్రకాష్ నారాయణ, యడ్లపాటి స్వరూప రాణి, ఈదర శ్రీనివాస్ రెడ్డి, తోట రామకృష్ణ, కొత్తూరు వెంకట సుబ్బారావు, కొక్కెర శ్రీనివాస్ యాదవ్, గాజుల వెంకయ్య నాయుడు, చరకా కుమార్ గౌడ్, వైవీ సుబ్బారావు పాల్గొన్నారు.